# పిచ్చు కుంటలవారి కథ

గ్రామాలు తిరుగుచూ కులాల చరిత్ర, గోత్రాలు చెప్పేవారు పిచ్చు కుంట్ల వారు వీరి గురించి 13 మరియు 14వ శతాబ్దపు సాహిత్యంలో వ్రాయబడినప్పటికీ వీరి పుట్టుపూర్వోత్తరాలు సరిగాతెలియవు. వీరి గురించి చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి. అందులో ఒకటి : బ్రహ్మ, విష్ణువు, మహేశ్వర వివాహములప్పుడు వారి గోత్రాలు చెప్పటానికి మనిషిదొరకుట కష్టమయినందున బ్రహ్మ ఒక మనిషిని సృష్టించెను. సృష్టించుటలో తొందరపాటువల్ల అతని కాలులేకుండా సృష్టించాడు. ఈ కుంటివానిని పెంచుబాధ్యతను సప్తమహర్షుల భార్యలకు అప్పగించాడు. తరువాత సప్తమహర్షుల భార్యల ఏడుగురు ఆడపిల్లలకు జననమిచ్చుట, ఆ పిల్లలు పెద్దవారయిన తర్వాత వారిని ఈ కుంటియువకునికిచ్చి వివాహం చేస్తారు. అతను తన భార్యలను పోషించుటకొరకు ఉద్యోగమిప్పించమని పరమశివుని కోరగా శివుడు అతనికి ఒక ఎద్దును, త్రిశూలాన్ని, గంటను ఇచ్చి జీవనభృతిని సంపాదించుకొనమని ఆదేశించాడు. ఆ యువకుడు ఎద్దుపై ఎక్కి గ్రామగ్రామములు తిరుగుచూ వివిధ కులాల వారికి వారి గోత్రాలు చెప్పి తన కుటుంబాన్ని పోషించుకొన్నాడని చెబుతారు. ఇంకొక కథ ఏమనగా భుజంగ రెడ్డి, తారకాదేవిలకు ఒక కుంటివాడు జన్మించినట్లు అతను రెడ్ల గోత్రంలు చెప్పచూ బ్రతికినట్లుగా చెప్పబడింది. పిచ్చుక కుంటలవారు గ్రామగ్రామాలు తిరుగుచూ వ్యవసాయం వృత్తిగా కల కులంవారి గోత్రాలు చెప్పచూ వారిచ్చిన పారితోషికంతో బ్రతుకుతున్నారు. వీరు శైవమతస్థులు, శ్రీశైల మల్లిఖార్జునస్వామి భక్తులు. లోగడ వీరు తిత్తి, గంట వాద్యాలుగా వాయిస్తూ కథలు చెప్పేవారు. తరువాత జంగంవారివద్ద శిష్యరికం చేసిన తర్వాత తంబూర, రెండు ఢిక్కీలతో కథలు చెప్పచున్నారు. వీరు జంగంవారివలె పైనించి మడమలవరకు అంగారకా, తలపాగా ధరిస్తారు. వీరు ఆయాప్రాంతాలకు సంబంధించిన వీరగాథలను చెబుతారు. రాయలసీమ ప్రాంతంలో రెడ్డి కథను చెబుతారు. కోస్తాప్రాంతంలోని పిచ్చుక కుంట్లవారు పల్నాటి యుద్ధం కథచెప్పటంలో ప్రసిద్ధులు. అందువలన వీరికి పల్నాటి పిచ్చుక కుంటలని పేరు వచ్చినది. ఈ కథ చెప్పేకథకునికి నడుముకు దట్టి, కాళ్లకు గజ్జెలు వుంటాయి. తంబురా ఉండదు. కుడిచేతిలో ఖడ్గం, ఎడమచేతిలో డాలు ఉంటాయి. వంతలలో ఒకడు పంబజోడు వాయిస్తాడు. మరొకడు తోలుతిత్తి ఊదుతాడు. ఊదే ఇత్తడి కొమ్ములు కూడా ఉంటాయి. వీరు "పల్నాటి యుద్ధం" కథను ఉద్రేకపూరితంగా చెబుతారు. కథ ద్విపద ఛందస్సుతో ఉంటుంది. వీర రసప్రధానమయిన ఈ కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.

ఇవికాక వీరు శ్రీ లక్ష్మమ్మ కథ, బాలనాగమ్మ కథ, కాంభోజిరాజుకథ మరియు కుంటి మల్లారెడ్డి కథలు చెబుతారు.